క్లుప్తంగా

రోడ్లపై కేజీవీల్స్ నడపొద్దు



మాట్లాడుతున్న ఎస్సై విక్రమ్

బెజ్జూర్: కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి తీసుకొస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విక్రమ్ హెచ్చరించారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడారు. కేజీవీల్స్ ట్రాక్టర్లు రహదారులపైకి రావడంతో రోడ్లు ధ్వంసమవుతున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక



రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల సత్యనారాయణ గౌడ్, అధ్యక్షుడిగా రాపర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల వరలక్ష్మి, అధికార ప్రతినిధిగా శంకర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా రాపర్తి నర్సింహులు, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ వహీద్, మల్లెపూల శారద, కార్యదర్శులుగా యూసీ శంకర్, వాసుదేవన బసవయ్య, సహాయ కార్యదర్శిగా కుమురం భాస్కర్, పురక విలాస్, కార్యవర్గ సభ్యులుగా మడావి నాగుబాయి, జాడి పాండురంగ్‌లను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన మండల అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ సమష్టి కృషితో డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు, డీలర్లు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల పద్మశాలీ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సంఘం మండల అధ్యక్షులుగా బూర్ల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా చిప్ప చిరంజీవి, కోశాధికారిగా వడ్డేపల్లి వెంకటేష్, గౌరవఅధ్యక్షులుగా చిప్ప నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాకే గజానన్, మహిళా అధ్యక్షురాలిగా శీలకంటి సత్తక్క, సంయుక్త కార్యదర్శిగా చిప్ప మల్లేష్, ప్రచార కార్యదర్శిగా గజం వెంకటేష్, సలహాదారులుగా వనమాల వసంత్, కోటేష్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా పద్మశాలీ సేవా సంఘం కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌లు వ్యవహరించారు. సంఘం కాగజ్‌నగర్ నాయకులు శంకరయ్య, రవి కుమార్ పాల్గొన్నారు.

అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన కడముంత పెంటమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని మహాత్మా గాంధీ ఆస్పత్రిలో మృతిచెందారు. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల కోసం దాతల ద్వారా సేకరించిన రూ.10,505లను మండల యువకులు ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు షౌకత్ అలీఖాన్, యువకులు జావిద్, గుమ్ముల శ్రీనివాస్, స్థానిక యువకులు నరేందర్ గౌడ్, జాహిద్ హుస్సేన్, మహేశ్ ఉన్నారు.

కేకే-ఓసీలో భోజన సౌకర్యం కొనసాగించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీ క్యాంటీన్‌లో కూరగాయల ధరలు పెరిగాయని, గనిపై నోటీస్‌బోర్డు అంటించి భోజన సౌకర్యం నిలిపేసారని, తిరిగి వెంటనే కొనసాగించాలని సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల టర్నోవర్ ఉన్న సింగరేణి సంస్థలో, కార్మిక సంక్షేమానికి కోతలు విధించడం విడ్డూరమని మండిపడ్డారు. క్యాంటీన్ బడ్జెట్‌ను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచి సబ్సిడీపై భోజన సౌకర్యం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ముగిసిందని, యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు ఐలయ్య, రాజేందర్, భరత్ ఉన్నారు.

ప్రాణాలు పోతున్నాయ్!



- నెలరోజుల్లో పాముకాటుతో ముగ్గురు మృతి
- పీహెచ్‌సీల్లోనూ అందుబాటులో యాంటీ స్నేక్ వీనమ్
- అవగాహన లేక పట్టణాలకు పరుగులు
- సకాలంలో వైద్యం అందక మృత్యువాత



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు అర్క అశోక్. పెంచికల్‌పేట్ మండలం గుండెపల్లి గ్రామానికి చెందిన ఇతన్ని రెండు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గం మధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

పెంచికల్‌పేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లోకి చేరిన విష పాములతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు, చేనుల్లో పనులు చేస్తున్న క్రమంలో పాము కాట్లకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గడిచిన నెల రోజుల్లో ముగ్గురిని పాములు కాటు వేయగా సకాలంలో వైద్యం అందకపోవడంతో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

పాముల సంచారం..

కాగజ్‌నగర్ డివిజన్‌లోని మారుమూల గ్రామాలు అడవులకు అతి సమీపంలో ఉండడంతో అనేక రకాల విషపాములు పంట చేలతో పాటు ఇంటి పరిసరాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పగటిపూట పాముల సంచారాన్ని పసిగట్టి జాగ్రత్తలు తీసుకుంటున్న ప్రజలు రాత్రిపూట పాము కాట్లకు బలవుతున్నారు.

అవగాహన లేక..

పాము కాట్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న చికిత్సలపై వైద్యశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పాముకాటుకు గురైన బాధితులు వైద్యం కోసం సుమారు 60 నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్ పట్టణానికి పరుగులు తీస్తూ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోతున్నారు. పాము విషానికి విరుగుడు యాంటీ స్నేక్ వీనమ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా బాధితులకు అవగాహన లేక చికిత్స కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అధికారులు గ్రామాల్లో పూర్తి స్థాయిలో పాము కాట్లపై, కేంద్రాల్లో అందిస్తున్న చికిత్సలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు..

- జూలై 2వ తేదీన కౌటాల మండలంలోని కనికి గ్రామానికి చెందిన నాయిని రమేశ్ ఇంట్లో పాము కాటు వేయడంతో మృతి చెందాడు.
- జూలై 4వ తేదీన బెజ్జూర్ మండలంలోని రెబ్బెన గ్రామంలో తొర్రెం సాన్విక ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో పాము కాటు వేయడంతో మృతి చెందింది.
- జూలై 16వ తేదీన చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన లోడెల్లి లలిత ఇంటి సమీపంలో ఆరుబయట పాటు కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది.

పీహెచ్‌సీల్లోనూ చికిత్స

పాముకాటుకు విరుగుడు యాంటీ స్నేక్ వీనమ్ వ్యాక్సిన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంది. పాముకాటుకు గురైన వ్యక్తిని వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వ్యాక్సిన్ ఇస్తే ప్రాణాపాయం తప్పుతుంది. ప్రజలు పీహెచ్‌సీల్లో అందిస్తున్న చికిత్సను సద్వినియోగం చేసుకోవాలి.

– నేహా, వైద్యాధికారి, పెంచికల్‌పేట్ పీహెచ్‌సీ

ఘనంగా జయశంకర్ జయంతి



కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం ఉన్న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ ఉద్యమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన మహోన్నత వ్యక్తి

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్ అని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 89వ జయంతి సందర్భంగా అసెంబ్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం జయశంకర్ చేసిన నిరంతర కృషి, దృఢ సంకల్పాన్ని తెలంగాణ ప్రజలు మరవలేరన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో లెక్చరర్లు ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్ ప్రత్యేక తెలంగాణ కోసం అహర్నిశలు కృషి చేశారని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం అన్నారు. జయశంకర్ జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు రమేశ్, అమల, భీంరావ్, సుభాష్‌సింగ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఆవరణలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ 89వ జయంతిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరచారి, నాయకులు శ్రీమంతుల వేణుగోపాల్‌చారి, బట్టుపల్లి అశోక్‌చారి, సురేశ్‌చారి, వెంకటయ్యచారి, రమేశ్‌చారి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి మండల అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనలో ఆయన చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు చౌదరి తిరుపతి, విశ్వబ్రహ్మణ అధ్యక్షుడు నల్లగొండ సురేశ్‌చారి, నరసింహాచారి, చిరంజీవి, శ్రీనివాస్, చందు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ సిబ్బంది జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహురొద్దీన్, సూపరింటిండెంట్ వాసు, ఏపీవో బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త అని ముత్తంపేట ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, ఈజీఎస్ సిబ్బంది నాందేవ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్



పెంచికల్‌పేట్: నివాళులర్పిస్తున్న నాయకులు



రెబ్బెన: నివాళులర్పిస్తున్న ఎంపీపీ సౌందర్య



కౌటాల: పూలమాల వేస్తున్న నాయకులు



విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం ఆధ్వర్యంలో..

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



శిబిరంలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

ఆసిఫాబాద్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 32వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చునార్కర్ శంకర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్మికులు మాట్ల రాజు, నవీన్, సునీల్, మహేశ్వర్, నాగేశ్వర్, యమున, తాహిర్, సాగర్, సాబీర్, శంకర్ పాల్గొన్నారు.

కౌటాల: కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 32వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మోరేశ్వర్, కరుణాకర్, ప్రకాశ్, రాజారం, లింగయ్య పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న సరిత

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం వివిధ గ్రామాలకు తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెంచికల్‌పేట్ తహసీల్దార్ సరిత అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు తలనీలాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవి ప్రసాద్‌ను ఆదివారం బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. జీఎంతో సమావేశమై ఏరియాలో పరిష్కరించాల్సిన కార్మిక సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఏరియాలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం జీఎం రవి ప్రసాద్ మాట్లాడుతూ ఏరియా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి గుర్తింపు సంఘం సహకరించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, 11 మెన్ కమిటీ సభ్యులు మంగీలాల్, ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, వెంకటేష్, ఫిట్ కార్యదర్శులు వెంకటేష్, వెంకన్న, తిరుపతి, రమేశ్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంతో ప్రజలకు సేవ చేసే అవకాశం



మాట్లాడుతున్న సీఐ సాదిక్ పాషా

చింతలమానెపల్లి: ఉద్యోగంతో ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందని సీఐ సాదిక్ పాషా అన్నారు. కెరమెరికి బదిలీపై వెళ్లిన ఎస్సై విజయ్ కుమార్ వీడ్కోలు సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎస్సైలు శాంతి భద్రతల రక్షణలో సమర్థవంతంగా పని చేయాలని, శాఖాపరమైన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న విజయ్ కుమార్, చింతలమానెపల్లికి వచ్చిన ఎస్సై వెంకటేష్‌లను స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు. నాయకులు డుబ్బుల వెంకన్న, భీంకరి నారాయణ, టోంబ్రె మారుతి, నీలాగౌడ్, టోంబ్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సుష్మా స్వరాజ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: గోలేటిలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో ముందుండి పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, జిల్లా నాయకులు అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, నాయకులు మల్రాజు రాంబాబు, విస్తారక్ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు ఓదెలు, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో నిండిన చెత్తాచెదారం



మహాలక్ష్మి ఆలయం వద్ద చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పట్టణంలోని మహాలక్ష్మి ఆలయం సమీపంలోని డ్రెయినేజీ చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు తెలిసినా స్పందించడం లేదని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మొర్రిగూడ సమీపంలో రోడ్డుపై గుంతలు

తిర్యాణి: శ్రీ ఇంక్లైన్ నుంచి మండల కేంద్రం వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిండి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

పశువుల తోపులాట.. ఒకరికి గాయాలు



వృద్ధుడికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

బెజ్జూర్: పశువుల తోపులాటలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన తకిరే హనుమంతు అనే వృద్ధుడు ఆదివారం వారసంత కావడంతో నిత్యావసరాల కోసం బస్టాండ్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పశువుల తోపులాట జరగడంతో హనుమంతు గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మెగా హెల్త్‌క్యాంప్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో ఈ నెల 13వ తేదీన గొంగ్లల శంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు.